# జైహింద్
## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

రెండవ ప్రపంచ యుద్ధం తీవ్రంగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువ భాగం బ్రిటిషు సైన్యం యుద్ధం తీవ్రంగా జరుగుతున్న యూరప్‌లో మోహరించింది. ఉన్న తక్కువమంది సైన్యంతోనే బ్రిటిషు సైన్యం బోసును ఎదుర్కోవాలి.

యుద్ధరంగంలో జరిగే యుద్ధం కంటే తెర వెనుక గూఢచారుల మధ్య జరిగే యుద్ధం గెలుపు ఓటములను నిర్దేశిస్తుందని అతనికి బాగా తెలుసు.

వార్నర్ నివాసం ఫోర్ట్ విలియమ్ ఆవరణలోనే ఉంటుంది.

ఆ రోజు ఉదయం వ్యాయామం పూర్తి చేసుకున్న అతను ఇంటి ముందు ఉన్న పడక కుర్చీలో పడుకున్నాడు. ఎదురుగా ఉన్న టేబుల్ మీద బిస్కెట్స్ పెట్టి ఉన్నాయి. అప్పుడే తెచ్చి టేబుల్ మీద పెట్టిన కెటిల్ నుండి టీ వేడి సెగలు కక్కుతోంది.

అతని ఎదురుగా హుగ్లీ నది పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది.

రెండు కప్పుల వేడి వేడి టీ తాగిన తరువాత అతను షేవ్ చేయించుకుంటాడు.

మొదటి కప్పు టీ తాగుతుండగా షేవ్ చేసే వ్యక్తి వచ్చి కొద్దిగా దూరంగా నిలబడ్డాడు.

టీ తాగటం పూర్తి అయిన తరువాత వార్నర్ షేవ్ చేసే వ్యక్తిని ముందుకు రమ్మని పిలిచాడు. అతను దగ్గరకు వచ్చిన తరువాత అతను ప్రతి రోజూ వచ్చే వ్యక్తి కాదని వార్నర్ గ్రహించాడు. “రోజూ వచ్చే బిపిన్ ఏమయ్యాడు?” అని అడిగాడు.

“మై నేమ్ సంతోష్...” చెప్పాడు కొత్త వ్యక్తి.

"ఇడియట్! నేను అడుగుతోంది బిపిన్ ఏమయ్యాడని?" కోపంగా అన్నాడు వార్నర్.

అతను అడుగుతున్నది అర్థం కానట్లు అయోమయంగా చూశాడు కొత్త వ్యక్తి సంతోష్.

"ఎవరక్కడ?" అంటూ పెద్దగా అరిచాడు వార్నర్.

ఒక సార్జెంట్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఎవడితను? పాత అతను ఏమయ్యాడు?"

"బిపిన్ అప్పులు చేసి తీర్చక పోవటంతో గొడవలు జరిగాయి. ఆ గొడవల్లో అతని చెయ్యి విరిగింది. కొన్నాళ్లు పనిచెయ్యలేదు. అందుకని ఇతన్ని పిలిపించాం..." చెప్పాడు ఆ సార్జెంట్.

"ఇంట్లో పని చేసే వాడికి నేను ఏం చెప్తున్నానో ఒక్క ముక్క అర్థం కాకపోతే ఎలా?"

"అలా అయితే మన రహస్యాలు పొరపాటున వినిపించినా ఏమీ అర్థం కావు కదా అని..." నసిగాడు సార్జెంట్.

విసుగ్గానే షేవ్ చేయించుకోవటానికి అంగీకరించాడు వార్నర్.

బర్మా స్వతహాగా అడవులతో కప్పబడి ఉండే దేశం. భారతదేశపు ఈశాన్య భాగాలు కూడా దాదాపు అదే వాతావరణంతో ఉంటాయి. రెండు చోట్లా వార్షిక వర్షపాతం 200 సెంటీ మీటర్లకు పైనే ఉంటుంది. అలాంటి వాతావరణంలో శత్రువుతో పోరాటం అంటే, కేవలం ఎదుటి సైన్యాన్ని గెలవటం కాదు. ప్రతికూల వాతావరణానికి తట్టుకుని నిలబడగలగటం.

ఒక రోజు హఠాత్తుగా సుభాస్ చంద్ర బోస్ తన అధికారులను సమీకరించాడు.

"అతి త్వరలో జపాను, ఆజాద్ హింద్ ఫౌజు ఉమ్మడి సైన్యం భారతదేశం లోకి ప్రవేశించబోతోంది. అప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోబోతున్నారో ఇప్పటి నుండే అలవరచుకోవటం మంచిది. మన సైనికులకు అడవుల్లో శిక్షణ ఇవ్వటం ప్రారంభించండి." అని సూచన చేశాడు.

అప్పటికప్పుడు మిలటరీ అధికారులు ప్లానింగ్ చేయటం ప్రారంభించారు. వారితోనే ఉన్న కెప్టెన్ లక్ష్మి వారు చేస్తున్న పనులు కొద్దిసేపు గమనించింది. తరువాత ఇక ఆగలేక, "మీ ప్లానింగ్‌లో మా రెజిమెంట్ స్థానం ఏమిటి? ఇప్పటి వరకు మీరు చేస్తున్న ఏర్పాట్లలో మా రెజిమెంట్ మెంబర్లకు ఎందుకు స్థానం కల్పించటం లేదు?" అని అడిగింది. వద్దనుకున్నా ఆమె కంఠంలో కోపం ధ్వనించింది.

"ఇవి ఆడవాళ్ళు చేసే పనులు కాదు కెప్టెన్ లక్ష్మీ."

"అంటే... వారి మీద మీరు జాలి చూపిస్తున్నారా?" మరింత కోపంగా అడిగింది లక్ష్మి.

"నా ఉద్దేశం అది కాదు..."

"మీకు మా రెజిమెంటును యుద్ధంలో ఉపయోగించే ఉద్దేశం ఉందా, లేదా?"

“మీ సభ్యులు ముందు వరసలో కాకుండా, వెనుక వరుసల్లో ఉండి యుద్ధం చేస్తున్న సైనికులకు సహకారం అందించవచ్చు...”

“సారీ! మీ అభిప్రాయంతో నేను ఏకీభవించను. మేము సహాయం చేయటానికి తప్ప ప్రత్యక్ష యుద్ధానికి పనికిరామని మీరు భావించిన పక్షంలో నేను ఇప్పుడే రాజీనామా చేస్తాను. మగ సైనికులకు పనిమనుషులను సప్లై చేసే రెజిమెంటుకు అధికారిగా ఉండటం నాకు ఇష్టం లేదు.” కోపంగా అంది కెప్టెన్ లక్ష్మి.

వారి వాదనను మౌనంగా వింటున్న సుభాస్ చంద్ర బోస్ కల్పించుకున్నాడు. “ఆడవారిని అబలలుగా చూడటం నా సిద్ధాంతం కాదు. మగవారు చేసే ఏ పని అయినా ఆడవారు చేయగలరని నమ్మే వారిలో నేను ఒకడిని. మన ఝాన్సీ రాణీ రెజిమెంట్‌ని యుద్ధంలోనే కాదు, గెరిల్లా దళంలోనూ, మరీ ముఖ్యంగా గూఢచార దళంలోనూ కూడా ఉపయోగించదలచుకున్నాను. ఇవన్నీ జరగాలంటే వారికి తగిన శిక్షణ ఇవ్వటం అవసరం...” అన్నాడు.

బోస్ అలా చెప్పటంతో అప్పటి నుండి రాణీ ఝాన్సీ రెజిమెంట్ సభ్యులను కూడా అడవుల్లో శిక్షణ ఇవ్వటం మొదలు పెట్టారు.

శిక్షణలో భాగంగా ప్రస్తుతం వారందరనీ అయిదుగురు ఉన్న గ్రూపులుగా విడగొట్టి అడవుల్లో వదిలిపెట్టారు. వారు ఉన్న ప్రదేశం ఏమిటో, ఎక్కడ ఉన్నారో వారికి తెలియదు. అలానే ఎవరికీ ఎలాంటి ఆహారం ఇవ్వలేదు. దొరికిన ఆహారం తింటూ తమను తాము రక్షించుకోవటం మాత్రమే కాకుండా, ఆ ప్రదేశం నుండి అతి త్వరగా సురక్షిత ప్రదేశానికి రావటం అన్నది వారికి ఇచ్చిన లక్ష్యం.

ఈ గ్రూపులో ఉన్న అయిదుగురు – కాంచనమాల, మధుబాల, చేవా, డోల్మా, ఫ్లోరెన్స్.

తమను తాము ఉత్సాహ పరచుకోవటానికి రాణీ ఝాన్సీ రెజిమెంట్‌లో ప్రాచుర్యం పొందిన ఒక గీతాన్ని పాడుతూ ముందుగా నడుస్తోంది మధుబాల.

హమ్ భారత్ కీ బేటీ హై
అబ్ ఉఠా చుకీ తల్‌వార్
హమ్ మర్‌నే సే నహీ డర్‌తీ
నహీ పీఛే పావ్ కో ధరతీ
ఆగే హీ ఆగే బఢతీ
కస్ కమర్ హుయీ తైయార్
హమ్ భారత్ కీ బేటీ...

హమ్ నయే నహీ హై లడాకే

దేఖో ఇతిహాస్ ఉఠాకే
హమ్ ఛత్రాణీ భారత్ కీ
దిఖలా దేంగీ నిజ్ వార్
హమ్ భారత్ కీ బేటీ...

జబ్ కర్ కృపాణ్ ఉఠాతీ
ఫిర్ కాల్ రూప్ బన్ జాతీ
సదియోం సే ప్యాస్ బుఝాతీ
ధరీ దేతీ సంసార్
హమ్ భారత్ కీ బేటీ...

జబ్ తక్ బాహోం మే బల్ హై
ధమనియోం మే రక్త్ ప్రబల్ హై
దిల్ మే నహీ పల్ బర్ కల్ హై
బినా కియే దేష్ ఉద్ధార్
హమ్ భారత్ కీ బేటీ...

ఫ్లోరెన్స్, చేవా హిందీని అర్థం చేసుకోగలుగుతున్నా పాటని పాడే స్థాయికి చేరుకోలేదు. మిగిలిన వారందరికీ హిందీ బానే వచ్చు.

డోల్మా, ఫ్లోరెన్స్ మొదట్లో మిలటరీ క్రమశిక్షణకు అలవాటు పడటానికి బాగా కష్టపడ్డారు.

వారితో క్రమం తప్పకుండా మాట్లాడుతూ, వారి బాధను అర్థం చేసుకోవటంలో మధుబాల ప్రముఖ పాత్ర పోషించింది. “మీరు ప్రస్తుతం వెనక్కి వెళ్లటానికి భయపడుతున్నారు. కొన్నాళ్లపాటు ఆశ్రయం పొందటానికి ఆజాద్ హింద్ ఫౌజును ఉపయోగించుకుంటున్నారు. అంతేనా?” అంది ఒక రోజు మధుబాల.

ఎటూ కాకుండా తల ఊపారు డోల్మా, ఫ్లోరెన్స్.

“త్వరలోనే ఈ సైన్యం ఇంఫాల్, కోహిమా మీద దాడి చేయాలనుకుంటోంది. అప్పుడు మీరు మీ ఇంటికి చేరుకునే అవకాశం నేను కల్పిస్తాను. అది తప్ప మీకు మరొక అవకాశం కూడా లేదు. అలాంటపుడు ఉన్న నాలుగు రోజులు మాతో కలిసిపోయి ఉండండి...” అంది మధుబాల.

డోల్మా, ఫ్లోరెన్సులకు కూడా అదే నిజమని అనిపించింది. ఇప్పుడు మిగిలిన ముగ్గురితో బాగా కలిసి పోయారు.

ఇప్పుడు ఈ అయిదుగురి లక్ష్యం ఒకటే – ఏ క్లూ లేకపోయినా, అందరి కంటే ముందు తమ గ్రూపే క్యాంపుకు చేరుకోవాలని. వారి మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేవు.

గ్రూపును ముందుండి లీడ్ చేస్తోంది చేవా. నైట్ విజన్ గాగుల్స్ పెట్టుకున్నవాడికి చిమ్మ చీకటిలో కూడా అంతా స్పష్టంగా కనపడినట్లు, చేవాకు మిగిలిన వారికి ఎవరికీ కనపడని వివరాలు అడవిలో కనిపిస్తాయి. పక్కకు తొలగిన తీగను చూసి, దాన్ని ఏ జంతువు రాసుకుంటూ వెళ్లిందో చెప్పగలదు. కింద మట్టి మీద కాలి ముద్రల జాడలు చూసి, అటు ఏ క్రూర మృగం వెళ్లిందో తెలుసుకోగలదు. ఎటు వైపు నడిస్తే క్షేమమో అంచనా వేయగలదు. మధుబాల అందరి కంటే వెనుక రక్షణగా ఉంటుంది. ఆమె చేతిలో గన్ ఉంటే సాధారణంగా గురి తప్పదు. డోల్మా, ఫ్లోరెన్సులకు భయం అంటే ఏంటో తెలియదు. ఎంతటి భీకర పరిస్థితుల్లో కూడా ఆత్మ స్థైర్యం కోల్పోరు. కాంచనమాల మొత్తం మీద టీమ్ బాధ్యతలు చూసుకుంటుంది.

గ్రూపు సభ్యుల మధ్య అంతటి అవగాహన ఉన్నపుడు వారు గెలవకుండా ఏ శక్తీ అడ్డుపడలేదు. అందుకే వారి గ్రూపు అందరి కంటే ముందు తమ స్థావరానికి తిరిగి వచ్చినపుడు ఎవరికీ ఆశ్చర్యం కలగలేదు.

ఒకరోజు సాయంత్రం పాంచ్ పటాకా సభ్యులు అయిదుగురు కలిసి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

"అవును చేవా! మీది అసలు బర్మానే అని విన్నాను. నిజమేనా?" అడిగింది డోల్మా.

"అవును..." విచారంగా చెప్పింది చేవా.

"మీ ఊరు ఎక్కడ?"

"ఇక్కడకు దగ్గరలోనే మా గూడెం ఉంటుంది..." అంటూ తను గూడానికి ఎందుకు దూరం కావలసి వచ్చిందో చెప్పింది చేవా.

"ఏంటీ! నువు ఉత్త చేతులతో పులిని చంపావా?" నమ్మలేనట్లు అంది ఫ్లోరెన్స్.

చేవా మొహం మీద చిరునవ్వు వెలసింది. "బర్మా భాషలో చేవా అంటే అర్థం తెలుసా?" అని అడిగింది.

"మాకు ఎలా తెలుస్తుంది? నువ్వే చెప్పు..." అంది మధుబాల.

"చేవా అంటే శక్తివంతమయినది అని అర్థం..."

"నా పేరు అర్థం తెలుసా?" అంది డోల్మా. ఎవరికీ తెలిసే అవకాశం లేదు కాబట్టి తనే చెప్పింది, "డోల్మా అంటే ఏడు కళ్ళు ఉండే తారా అనే దేవత మరో పేరు. స్వేచ్ఛకు మరో పేరు."

"ఫ్లోరెన్స్ అంటే వికసిస్తున్న పువ్వు." అని చెప్పి మరి మీ పేర్లు చెప్పండి అంది ఫ్లోరెన్స్ మిగిలిన ఇద్దరిని చూస్తూ.

"కాంచనమాల అంటే బంగారంతో చేసిన దండ అని అర్థం."

“మధుబాల అంటే తేనె...”

“అసలు విషయం మరచిపోయి మన సంభాషణ ఎటో వెళ్ళి పోతోంది. చేవా ఏం చెప్పింది? గూడెం నాయకుడయిన వాళ్ల నాన్నని జపాను పోలీసులు అన్యాయంగా అరెస్ట్ చేశారని చెప్పిందా, లేదా? మరి ఇప్పుడు బర్మా మన ఆధీనంలో ఉంది. ఆ తప్పును సరి చేయాలా వద్దా?” అంది కాంచనమాల.

అందరూ అంగీకారంగా తల ఊపారు.

ఆ రాత్రి కెప్టెన్ లక్ష్మి ని కలుసుకున్నారు వారు.

ఆమెకు కూడా వీరి ప్రతిపాదన నచ్చింది. ఒక వాహనం, అధీకృత పత్రం ఇచ్చి రెండు రోజుల లోపు తిరిగి రమ్మని పంపింది.

రెండు మూడు గంటల్లో డోల్మా తండ్రి డాచెన్ ఉన్న జైలు ఎక్కడ ఉందో తెలుసుకున్నారు. అది సైమూన్ పట్టణంలో ఉంది. అక్కడకు వెళ్లారు.

“అసలు అతని మీద ఉన్న ఛార్జెస్ ఏమిటి?” అడిగింది కాంచనమాల జైలర్‌ను.

రికార్డులు చూసిన జైలర్, “జపాను వాళ్లకు వ్యతిరేకంగా కుట్ర చేయటం...”

“అది అబద్ధం. అతన్ని వెంటనే విడుదల చేయండి...” అధికారయుతంగా అంది మధుబాల.

“అలా చేయటం కుదరదు మేడం. మీరు చెప్పారని అతన్ని విడుదల చేస్తే నా ఉద్యోగం పోతుంది...” ఏడుపు మొహం పెట్టి అన్నాడతను.

“నోటి మాటల మీద విడుదల చేయనవసరం లేదు. ఇవిగో పత్రాలు...” అని కెప్టెన్ లక్ష్మి ఇచ్చిన కాగితాలు చూపించింది కాంచనమాల.

ఇక అడ్డుచెప్పటానికి ఏమీ లేక పోయింది జైలర్‌కి.

తనను విడుదల చేయిస్తున్న కూతురుని గర్వంగా చూసుకున్నాడు డాచెన్.

అందరినీ తన గూడానికి ఆహ్వానించాడతను.

చేవాతో పాటు మిగిలిన నలుగురు కూడా గూడెం బయలుదేరారు. అనుకోకుండా వచ్చిన డాచెన్‌ని చూసి అతని మీద కుట్ర చేసిన యువకులు బిత్తర పోయారు. అయితే చేవా వారి మీద కోపం చేసుకోలేదు. “మీరందరు కలిసికట్టుగా ఉండండి. మన ఒక్క గూడెం ఐక్యంగా లేకపోతే ఏమవుతుందని అనుకోవద్దు. ప్రతి ఒక్కరు అలా అనుకోబట్టే మన మీద బ్రిటిషు వాళ్ళు రాజ్యం చేస్తున్నారు. ఆ బాధ తాత్కాలికంగా తప్పినా ఇంకా ముప్పు తప్పి పోలేదు. స్వరాజ్యం వచ్చే వరకు అందరు కలిసి కట్టుగా ఉండండి...” అంటూ వెనక్కి బయలుదేరింది చేవా.

“నువ్వు ఎక్కడకీ వెళ్లవద్దు...” అని గూడెం జనాలు ప్రాధేయపడుతుంటే, “పులిని వేటాడితే మీకు నాయకత్వం చేసే అధికారం వస్తుందనుకున్నాను. బయట ప్రపంచంలో వేటాడాల్సిన పులులు చాలా ఉన్నాయి. ఆ పని పూర్తి చేసి వస్తాను.

ఆ రోజు ఎంతో దూరంలో లేదు. అప్పటివరకు నా అవసరం మీ కంటే బయట ఎక్కువ ఉంది...” అని అందరి దగ్గరా సెలవు తీసుకుంది చేవా.

చెప్పినట్లే గడువులోపు అయిదుగురు తిరిగి తమ యూనిట్‌కి రిపోర్ట్ చేశారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS